క్లుప్తంగా

4న ఉపసర్పంచ్ ఎన్నిక

రామసముద్రం: రామసముద్రం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈనెల 4వతేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వలన రామసముద్రం పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా పడటం జరిగిందన్నారు. దీంతో సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మెజారిటీ వార్డు సభ్యులు చేతులెత్తే ప్రక్రియతో ఉపసర్పంచ్‌ను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

వివాదాస్పదంగా చీరల వేలం

మదనపల్లె సిటీ: స్థానిక కోర్టు ఆవరణంలోని గంగమ్మ ఆలయంలో శుక్రవారం చీరల వేలం వివాదాస్పదంగా మారింది. ఆలయ కమిటీ తాత్కాలిక చైర్మన్ నాగార్జునబాబు ఆలయంలోని కార్యాలయంలోని అమ్మవారి చీరలను బహిరంగంగా వేలం వేశారు. తమకు ఏ మాత్రం తెలియకుండానే ఎలా వేలం నిర్వహిస్తారని తాత్కాలిక కమిటీ సభ్యులు ఆరోపించారు. అమ్మవారికి భక్తులు భక్తితో చీరలు సమర్పించారు. వీటిని కమిటీ సభ్యులతో పాటు పెద్దలతో కలిసి వేలం నిర్వహించాలి. ఇటీవల కమిటీ సభ్యుల ఆధిపత్యపోరు కారణంగా ఆలయం మూతవేశారు. బీకెపల్లె భక్తులు ఆలయం తెరిపించాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. భక్తుల కోరిక మేరకు డీఎస్పీ కేశప్ప ఆలయం తెరిచేలా చర్యలు తీసుకున్నారు. అయితే తిరిగి తాత్కలిక చైర్మన్ మళ్లీ వేలం , ఇతర కార్యక్రమాలు నిర్వహించడంపై కమిటీ సభ్యులు మండిపడుతున్నారు.

దోమకాటుపై అప్రమత్తత అవసరం

వాల్మీకిపురం: దోమకాటుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని నగిరిమడుగు పీహెచ్‌సీ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నగిరిమడుగు గ్రామంలో పర్యటించి మలేరియా వ్యాధి పట్ల అవగాహన, దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్, మండల వైద్యాధికారులు నయీమ్, శారద పాల్గొన్నారు.

మండలానికి 181 పెన్షన్లు మంజూరు

రామసముద్రం: రామసముద్రం మండలానికి 181 నూతన పెన్షన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరికెల పంచాయతీ -12, చెంబకూరు-12, చొక్కాండ్లపల్లి-9, ఎలవానెల్లూరు-11, కమ్మవారిపల్లె 10, కాప్పల్లె -14, మాలేనత్తం-9, మినికి-7, మూగవాడి-15, పెద్దకురప్పల్లె -9, ఆర్.నడింపల్లి -16, రామసముద్రం-1కు -25, రామసముద్రం-2 కు 5, ఊలపాడు-14 పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. మంజూరైన పెన్షన్లు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

కురబలకోట: మండలంలోని తెట్టులో డివిజన్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి నేరుగా గడపగడపకు వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలించారు. మార్పులు, చేర్పులు గురించి విచారించారు. చనిపోయిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు ఎం.బీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతికి హాజరుకండి

కలకడ : మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడకలకు మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని మండల పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. శనివారం ఉదయం కలకడ బస్టాండ్ మూడురోడ్ల కూడలి వద్ద డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూజలు చేసి నివాళ్ళు అర్పించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటింటా సంతోషం


అంగళ్లులో పల్లెబాట నిర్వహిస్తున్న నాయకులు

కురబలకోట: పల్లెబాటకు ప్రజల నుంచి మంచి స్పందన కన్పిస్తోంది. శుక్రవారం మండలంలోని అంగళ్లు గ్రామంలో ఆగ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి ఆధ్వర్యంలో పల్లె బాట నిర్వహించారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజల్ని అడిగారు. తమకంతా అర్హత ఉన్న పథకాలు వస్తున్నాయని సంతోషంతో చెప్పారు. సీఎం జగన్‌కు అండగా ఉంటామన్నారు. ఇన్ని పథకాలు గతంలో ఏ సీఎం ఇవ్వలేదని నేరుగా లబ్ధి పొందుతున్నామన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ

పీలేరు : ఈ నెల 3న పుంగనూరు టౌన్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేద్దామని బాస్ జిల్లా కోకన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో గద్దరన్న సంస్మరణ సభ కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి వార్డుబాట

- ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయం
- కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- గడప గడపకు మన ప్రభుత్వం సమీక్షలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా


మున్సిపల్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని 35 వార్డుల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ఆయా వార్డుల కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో వార్డుబాట నిర్వహించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలు, పరిష్కారానికి తీసుకున్న చర్యలపై కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు మదనపల్లె మున్సిపాలిటీ, నిమ్మనపల్లె మండలంలో ప్రతి గడపకు వెళ్లి ప్రజలను నేరుగా కలవడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతమేర నెరవేర్చాము, చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వ అధికారులతో, సచివాలయ సిబ్బందితో సమీక్షించి, ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మదనపల్లె పట్టణంలో 35 వార్డులు, 44 సచివాలయాలు ఉంటే, ఒకో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున అభివృద్ధి నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిని ఏ విధంగా ఖర్చుచేయాలనే విషయమై సమీక్షలో చర్చించి కౌన్సిలర్లకు తెలియజేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా, అవినీతికి తావు లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కే.ప్రమీల, ఏఈ స్నేహప్రియ, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, హౌసింగ్ డీఈ రామస్వామిరెడ్డి, ఏఈ దీనదయాళ్‌రాజు, ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్, ఏఈ రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
- మండల్‌మీట్‌లో ఎంపీపీ సాయిలీలా


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశ్విని

ములకలచెరువు: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఎంపీపీ సాయిలీలా అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాయిలీలా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు రాంబాబు, ఆయిషా, ప్రభావతమ్మలు ఎస్ఈబీ సీఐ మల్లికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లో కర్ణాటక మద్యం ఏరులై పారుతోందని... కట్టడి చేయాలని కోరగా... నా మీద పలువురు ప్రజాప్రతినిధులు కక్షకట్టి అనవసరంగా ఆరోపనలు చేస్తున్నారని చెప్పడంతో మండల్‌మీట్ గందరగోలంగా మారింది. సీఐ, ప్రజాప్రతినిధుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఎంపీడీఓ అశ్విని కలగజేసుకొని ప్రజాప్రతినిధులు అడిగిన వాటికి సానుకూలంగా స్పందించాలి. అంతేగాని వాదనలు చేయడం సరికాదని సీఐ మల్లికకు సూచించారు. కర్ణాటక మద్యం అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పడంతో ప్రజాప్రతినిధులు శాంతించారు. అనంతరం జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి ఏర్పాట్లు పూర్తి చేయాలని ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. పక్కా గృహాల అర్హులకు ప్రొవిజన్ సర్టిఫికేట్లు అందించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్ గౌరీశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


హోంగార్డు ఆదినారాయణ భార్య రాజ్యలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : బి.కొత్తకోట, ములకలచెరువు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డ్ ఆదినారాయణ కుటుంబానికి డీఎస్పీ కేశప్ప శుక్రవారం ఆర్థికసహాయం అందించారు. అన్నమయ్య జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన రూ.90,000 చెక్కును స్థానిక మదనపల్లె సబ్‌డివిజన్ కార్యాలయంలో కేశప్ప ఆదినారాయణ భార్య రాజలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆపద సమయంలో హోంగార్డ్ కుటుంబానికి అండగా నిలిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు, మహమ్మద్, ప్రసాద్‌నాయక్, శ్రీరెడ్డి, హేమనాథం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టెలికామ్ సభ్యుడిపై దాడి

గుర్రంకొండ: జిల్లా టెలికామ్ సలహామండలి సభ్యుడు శేషాద్రినాయుడుపై దాడి చేయడంతో పోలీసులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసిన సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శేషాద్రి నాయుడు స్థానికంగా ఓప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం పాఠశాలలో చిన్నపాటి వివాదం జరిగింది. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన షేక్ సుమియా, ముస్తాక్, ముస్తఫా డాన్, షఫీ, హసన్, తన్వీర్, ఎహసాన్, కార్తిక్, రెడ్డిబాషాలు గురువారం రాత్రి పాఠశాల వద్దకు చేరుకొని శేషాద్రినాయుడుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడికి సంబందించి మొత్తం తొమ్మిది మందిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు,

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా

ఏఎస్పీ రాజ్‌కమల్


విలేకరులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజ్‌కమల్

మదనపల్లె : జిల్లాలో గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఏఎస్పీ రాజ్‌కమల్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..గంజాయి అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. గతంలో గంజాయి అక్రమరవాణా విక్రయాలపై దృష్టిసారిస్తే.. ప్రస్తుతం గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయికి అలవాటుపడిన వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. అంతేకాకుండా రీహాబిటేషన్ సెంటర్లకు పంపి గంజాయి అలవాటు మానేలా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం, గంజాయి తదితర కేసుల్లో పట్టుబడితే ఎదుర్కోవాల్సిన సమస్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలో ఇటీవల క్రైమ్‌రేటు పెరగడంపై స్పందిస్తూ... రకరకాల కారణాలతో నేరాలు అధికమయ్యాయని, ఎప్పటికప్పుడు కేసులు సత్వరపరిష్కారం చేసి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. కొండామారిపల్లె బోడుమల్లుదిన్నె టమాటా రైతు హత్యకేసులో దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ కేశప్ప, సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: జగనన్న సంక్షేమ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు మహమూద్, శివన్న, సుబ్బరాం, డ్రిప్ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతిలో ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులతో కలసి పల్లెబాట చేపట్టారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. గడప, గడపకూ వెళ్ళి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందిన విధానాన్ని వివరిస్తూ ప్రజా సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ పల్లెబాట కొనసాగించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు రూ.54 లక్షలతో పూర్తి చేసిన వివిధ అభివద్ధి పనులను ప్రారంభిం చారు. అనంతరం కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సారకుండ్ల శ్రీదేవి, పప్పు క్రిష్ణవేణమ్మ, పప్పు రాజారెడ్డి, రామక్రిష్ణ, గౌతంరెడ్డి, జయచంద్రారెడ్డి, సూరి, వెంకట్రామిరెడ్డి, రామచంద్ర,రియాసత్ అలీఖాన్, ఎంపీడీఓ గిరిధర్ రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లుల స్వాహాపై ఫిర్యాదు

గుర్రంకొండ: బినామీల పేర్లతో ఉపాధిహామీ బిల్లులు స్వాహా చేశారంటూ శెట్టివారిపల్లె గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ వెంకటేశులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత ఆరు నెలలుగా ఉపాధిహామీపథకంలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ సిబ్బంది మస్టర్లలో బినామీ పేర్లు పెట్టి బిల్లులు స్వాహా చేస్తున్నారన్నారు. నిజంగా పనిచేసే కూలీలకు రోజువారీ రూ.160 గిట్టుబాటు అవుతుండగా బినామీ పేర్లతో ఉన్న కూలీలకు రోజువారీ కూలీ రూ.220 వరకు చెల్లిస్తున్నారన్నారు. ప్రతిరోజు పనిచేయకుండానే వంద మంది బినామీ కూలీల పేర్లు మస్టర్లలో చేర్చి బిల్లులు స్వాహా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. గ్రామంలోని చెరువుల్లో గతంలో చేసిన పాత గుంతలకే మళ్లీ కొత్తగా పనులు చేసినట్లు చూపించి ఉపాధి హామీ సిబ్బంది ఇష్టానుసారంగా ఉపాధి బిల్లులు బొక్కేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి సిబ్బంది అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. ఏపీవోతో కలసి తామే స్వయంగా వీటిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో మూడో రోజు విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలు, పొందిన ఆర్థిక లబ్ధి కుటుంబాల వారీగా చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఉన్న జనాభాను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యను శాశ్విత ప్రాతిపదికన పరిష్కరించడానికి రూ. 40 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. కాలనీలో బోర్లు, పైపులైన్లు, కొళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. చిన్న చిన్న సమస్యలతో పింఛన్లు, ఇళ్ల అందనివారికి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాల తోపాటు ఎన్నో కొత్త పథకాలు అమలు చేస్తున్నట్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హరిణి, హబీబ్‌బాషా, నాయకులు రమేష్‌రెడ్డి, మహితా ఆనంద్, చలపతి, సురేష్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, లోక, నరేష్‌రెడ్డి, షాకీర్, మునీర్, గరుడారెడ్డి, దావూద్, బోడేషావలి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలి


వంట గదిని పరిశీలిస్తున్న జడ్జి గాయత్రి

వాల్మీకిపురం: ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన ఆహారాన్ని తప్పని సరిగా మెనూ ప్రకారమే అందించాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి గాయత్రి అన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో జడ్జి మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని, సురక్షితమైన తాగునీటితో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని సమయానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలు దోమకాటుకు గురి కాకుండా చూడాలన్నారు. అనంతరం జడ్జి తరగతి గదుల్లో తిరిగి గురుకుల పాఠశాలలో అందుతున్న సేవలపై విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, ఏజీపీ అశోక్ కుమార్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్, ఎస్ఐ క్రిష్ణమూర్తి, ఉపాధ్యాయ బృందం, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్త పై దాడి

కురబలకోట : మండలంలోని దాదంవారిపల్లి మహిళా సర్పంచ్ అమరావతమ్మ భర్త వెంకటరమణారెడ్డి(65)పై ముదివేడులో కొంతమంది కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడ్డ వెంకటరమణారెడ్డిని స్థానికులు గమనించి మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. వివరాలిలా.. దాదంవారిపల్లి గ్రామంలో శ్రీకాంత్ రెడ్డి, శివారెడ్డి చెరువులో వలలతో చేపలు పడుతుండగా సర్పంచ్ భర్త ఇప్పటికే ఆ చేపల చెరువును వేరే వారికి వేలం ద్వారా అప్పగించాం. చేపలు పట్టవద్దని చెప్పాడు. దీన్ని అదునుగా తీసుకొని తమనే ఆక్షేపిస్తావా అని ముదివేడు బస్టాండ్లో శుక్రవారం సాయంత్రం శ్రీకాంత్ రెడ్డి, శివారెడ్డిలు కర్రలతో వెంకటరామణారెడ్డిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ముదివేడు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

కురబలకోట: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతుతన్నాయని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు అన్నారు. అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాల కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శిక్షణ ప్రతిభకు పదును పెడుతుందన్నారు. సచివాలయాల ద్వారా స్వపరిపాలన సాధ్యమైందన్నారు. పూర్తి అవగాహన ఉన్నప్పుడే విధినిర్వహణలో రాణించగలరన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఇప్పటికే అనేక సేవలు అందుతున్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. పంచాయతీలు ఆదాయ మార్గాలు పెంచుకోవడం, మెరుగైన సేవలు అందించడం, గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడం ఈ మూడు కీలక అంశాలన్నారు. గ్రామాలు విస్తరిస్తున్నందున లే అవుట్లు, భవన నిర్మాణాలు, జీవన శైలి తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.

రూ.95 లక్షలతో కాలువల నిర్మాణం


కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

బి.కొత్తకోట: నగర పంచాయతీలో రూ.95లక్షలతో మురికినీటి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పీఆర్.మనోహర్ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక పంచాయతీరోడ్డు, దిగువబస్టాండ్ ప్రాంతాల్లో మురుగునీటి కాలువ సమస్యలపై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. పట్టణంలో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలిగించాలని ఎంపీ, ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఎంపీ మిథున్‌రెడ్డి నిధులు రూ.35 లక్షలు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.60 లక్షలతో మురికినీటి కాలువలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

బి.కొత్తకోట: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాలు వందశాతం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మదనపల్లె డీవైఈఓ జి.కృష్ణప్ప అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఆదర్శ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల లెసన్ ప్రణాళిక, టీచింగ్ నోట్స్, టీచింగ్ డైరీని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని తరగతి గదుల్లోకి వెళ్లి ప్రశ్నలతో సమీక్షించారు. స్వచ్ఛభారత్-స్వచ్ఛపఖ్వాడా మిషన్‌లో భాగంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ప్రిన్సిపాల్ శీనునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తగా మంజూరైన పెన్షన్‌లు పంపిణీ


పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్

మదనపల్లె : మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అంకిశెట్టిపల్లె, చీకలబైలు పంచాయతీల్లో పెన్షన్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... మదనపల్లె మండలంలో ఆగస్టుకు సంబంధించి 13,399 మంది లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశామని, కొత్తగా 353 నూతన పెన్షన్‌లు మంజూరయ్యాయన్నారు. అలాగే 596 దరఖాస్తులకు సంబంధించి వెరిఫికేషన్ చేయాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీ చేశామన్నారు. కార్యక్రమంలో అంకిశెట్టిపల్లె సర్పంచ్ శరత్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలో శుక్రవారం అవ్వా,తాతలకు పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. మండలంలో 6141 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. గ్రామవలంటీర్లు లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి పెన్షన్ అందజేశారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



బి.కొత్తకోట: రోడ్డును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, తంబళ్లపల్లె: పల్లె బాటలో నాయకులు

బి.కొత్తకోట: మండలంలో ప్రజల నుంచి అందే రెవెన్యూ ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ రఫీక్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాయనబావి పంచాయతీలోని పట్రవారిపల్లె, గుట్టపాళ్యం, ఆంజనేయపురం, నాయనబావి, కంబాలపల్లె, కాయలవారిపల్లె, గజ్జివారిపల్లెల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయనబావి నుంచి కాయలవారిపల్లెకు నూతనంగా రూ.66 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పటీసీ రామచంద్ర, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, సర్పంచులు జయరామిరెడ్డి, ఉమామహేశ్వరీ, భీమగాని నాగిరెడ్డి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మియాసాబ్, మాజీ వైస్‌ఎంపీపీ అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

తంబళ్లపల్లె: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ అనసూయమ్మ, రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం రెడ్డికోట, కుక్కరాజుపల్లె పంచాయతీలలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు సర్పంచులు నాగమణి, రామ్‌రాజ్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు సీసీ రోడ్లు, తార్‌రోడ్లను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీయం గంగాధర్, ఏపీవో అంజనప్ప, వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు రెడ్డికోట రామస్వామి, కోటిరెడ్డి, రమేష్‌రెడ్డి, నారాయణ, జగదీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం కృషి


పల్లెబాటలో ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దమండ్యం: ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం కృషి చేస్తోందని మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ మండ్యం హరిజనవాడ, వెంగంవారిపల్లెల్లో శుక్రవారం గ్రామ సర్పంచ్ కంటి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. పథకాలకు అర్హులై ఉండి రాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. మహిళలు, రైతులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శారదమ్మ, ఎంపీడీవో శ్రీధర్‌రావు, సర్పంచ్‌లు బాషా, విశ్వనాధ, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ పాల్గొన్నారు.